క్లుప్తంగా

ఆత్మీయ స్వాగతం



ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం ఇస్తున్న దొరబాబు

సామర్లకోట: గుంటూరు జిల్లా కృష్ణాయపాలెం లేఅవుట్ వద్ద ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు ఘన స్వాగతం పలికారు. సీఆర్‌డీఏ పరిధిలో పేద అక్కచెల్లెమ్మలకు గృహ నిర్మాణ శాఖ ద్వారా ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసేందుకు వచ్చిన సందర్భంగా పుష్పగుచ్ఛం ఇచ్చి ఆహ్వానం పలికారు.

మండల కో ఆప్షన్ సభ్యుడికి పరామర్శ



శ్రీనివాసరావును పరామర్శిస్తున్న జెడ్పీటీసీ తులసీ కుమార్, నాయకులు

కొత్తపల్లి: మండలంలోని పొన్నాడ శివారు కోన పాపపేటకు చెందిన మండల కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు అనారోగ్యంతో బాధపడుతున్నాడు. సోమవారం పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, అధికారులు కోన పాపపేటలోని తన స్వగృహంలో ఆయనను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పరామర్శించిన వారిలో జెడ్పీటీసీ గుబ్బల తులసీకుమార్, వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, కుతుకుడుమిల్లి సర్పంచ్ కర్రి చిన్నారావు, ఎంపీడీఓ అబ్రహం లింకన్, ఈఓపీఆర్డీ భాస్కరరావు, మండల పరిషత్ సిబ్బంది ఉన్నారు.

సమస్యలు పరిష్కరించండి

పెద్దాపురం: స్థానిక వాలుతిమ్మాపురం రోడ్డులోని టిడ్కో గృహాల వద్ద సమస్యలను పరిష్కరించాలని బీజేపీ పట్టణ కమిటీ సోమవారం మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్రకు వినతిపత్రం అందజేసింది. ఆ పార్టీ పట్టణ అధ్యక్షులు అల్లు ప్రసాద్, గడిగట్ల సతీష్, రాంకుమార్, నెక్కల ప్రకాష్ మాట్లాడుతూ టిడ్కో లబ్ధిదారులకు పూర్తి స్థాయిలో గృహాలను అప్పగించి సౌకర్యాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో చీకట్ల నాగేశ్వరరావు, కొత్త వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉపాధి శిక్షణ

సామర్లకోట: కాకినాడ జేఎన్‌టీయూలో నిరుద్యోగ యువతీ, యువకులకు ఇస్తున్న ఉపాధి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎం బి.ప్రశాంతి పిలుపునిచ్చారు. బీటెక్ ఇంజినీరింగ్, ఈసీఈ మెకానికల్ పూర్తి చేసిన యువతీ యువకులకు ఆటోమొబైల్, ఆటోమేషన్, రోబోటిక్ టెక్నాలజీ, సాఫ్ట్‌వేర్ కోర్సులపై అధునాతన పరిజ్ఞానంతో నాలుగు నెలల పాటు శిక్షణ ఇస్తారన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి మల్టీనేషనల్ కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారన్నారు. శిక్షణ సమయంలో భోజన, వసతి సౌకర్యాలు ఉంటాయన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు జిల్లా జాబ్స్ కోఆర్డినేటర్ జీవీ రమణ, 99898 81098 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలన్నారు.

డివిజన్ స్థాయి 'స్పందన'కు 8 అర్జీలు



అర్జీని పరిశీలిస్తున్న పెద్దాపురం ఆర్డీఓ సీతారామారావు

పెద్దాపురం: డివిజన్ స్థాయిలో సోమవారం నిర్వహించిన 'స్పందన' కార్యక్రమానికి ఎనిమిది అర్జీలు వచ్చాయని పెద్దాపురం ఆర్డీఓ జె.సీతారామారావు తెలిపారు. పట్టాదారు పాస్ పుస్తకం కావాలని, భూ తగాదా పరిష్కరించాలని, ఆక్రమణలు తొలగించాలని తదితర సమస్యలపై ఫిర్యాదులు అందాయన్నారు. అనంతరం స్థానిక విలేకర్లతో ఆయన మాట్లాడుతూ స్పందన కార్యక్రమానికి వచ్చే ప్రతి అర్జీని ఆయా శాఖలకు బదిలీ చేసి సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని అన్నారు. డీఎల్‌పీఓ బాలామణి, పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయ డీటీ భానుకుమార్, మున్సిపల్ మేనేజర్ జ్యోతిరాణి, ఏడీఏ దైవకుమార్, రవిశంకర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అండర్ పాస్ నిర్మించాలి

సామర్లకోట: గొంచాల– అచ్చంపేట 216 జాతీయ రహదారి వద్ద అండర్ పాస్ ఏర్పాటు చేయాలని కాకినాడలో జరిగిన జిల్లా స్పందనలో ఫిర్యాదు చేసినట్లు జనసేన నియోజకవర్గ కన్వీనర్ తుమ్మల బాబు తెలిపారు. గత టీడీపీ హయాంలో జాతీయ రహదారి నిర్మాణం సమయంలో అప్పటి ప్రజాప్రతినిధులు స్పందించక నేడు ప్రతి రోజూ ఈ ప్రాంతంలో ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ మేరకు డీఆర్వో సత్యనారాయణకు, కాకినాడ ఆర్డీఓ వెంకటరమణకు వినతి పత్రాలు అందజేశామన్నారు.

గట్టెక్కిన మెట్ట కష్టాలు

- ఎత్తిపోతల పథకాలతో రైతులకు మేలు
- డెల్టా కంటే ముందుగా నాట్లు
- ఉచిత విద్యుత్తు సరఫరా

సామర్లకోట: ఎత్తిపోతల పథకాలు మెట్ట ప్రాంత రైతులకు ఎంతో మేలు చేస్తున్నాయి. గోదావరి జలాలు అందుబాటులో ఉన్నా సాగుకు నీరు అందని మెట్ట ప్రాంతాల రైతుల కోసం ఎత్తిపోతల పథకాలను ఏర్పాటు చేశారు. ఈ పథకాలకు దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఉచిత విద్యుత్తు అమలు చేయడంతో సాగుకు సమస్య లేకుండా పోతోంది. గోదావరి



పీబీ దేవం ఎత్తిపోతల పథకం

జలాల సరఫరాలో ఎత్తిపోతల పథకాలకు ప్రాధాన్యం ఇవ్వడంతో డెల్టాలోని రైతుల కంటే



వేట్లపాలెం ఎత్తిపోతల పథకం

మెట్ట రైతులు ముందుగానే నాట్లు వేసుకున్నారు. ధవళేశ్వరం నుంచి కాకినాడ వరకు 65 కిలోమీటర్ల పొడవున ఉన్న కాలువను సామర్లకోట గోదావరి కాలువగా పిలుస్తారు.

నీటిపారుదల శాఖ సహకారంతో...

రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ దశల వారీగా ఆరు గ్రామాల్లో ఎత్తిపోతల పథకాలను ఏర్పాటు చేసింది. సామర్లకోట మండల పరిధిలో వేట్లపాలెం, జి.మేడపాడు, పీబీ దేవం గ్రామాల్లోనూ బిక్కవోలు మండలానికి సంబంధించి ఇల్లపల్లి, బిక్కవోలు, కాపవరం గ్రామాలలో ఎత్తిపోతల పథకాలను ఏర్పాటు చేశారు. 2004 వరకు ఎత్తిపోతల పథకాలకు చెందిన విద్యుత్తు బిల్లులను రైతులే చెల్లించవలసి వచ్చేది. దీని కారణంగా నిర్వాహణ భారంగా ఉండేది.

వైఎస్సార్ చలువతో...

దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి రైతుల కష్టాలు తెలుసుకొని ఈ పథకాలకు ఉచిత విద్యుతు అమలు చేశారు. అంతంటితో ఆగకుండా నీరు తోడే గంటలను 9 నుంచి 18కి పెంచడంతో ఎత్తి పోతల పథకాలు ఊపిరి పీల్చుకున్నాయి. సామర్లకోట గోదావరి కాలువపై ఆరు ఎత్తిపోతల పథకాలు విజయవంతంగా సాగుతున్నాయి. వేట్లపాలెం ఎత్తిపోతల పథకం కింద 1,750 ఎకరాలు, జి.మేడపాడు ఎత్తిపోతల పథకం కింద 1,050 ఎకరాలు, పీబీ దేవం ఎత్తిపోతల పథకం కింద 800, ఇల్లపల్లి ఎత్తిపోతల పథకం కింద 750, బిక్కవోలు పథకం కింద 600, కాపవరం ఎత్తిపోతల పథకం కింద 650 ఎకరాలకు నీరు అందుతోంది.

80 శాతం నాట్లు పూర్తి



పీబీ దేవం అన్నపూర్ణ ఎత్తిపోతల పథకం కింద 800 ఎకరాలకు సాగు నీరు అందుతుండగా ఇప్పటి వరకు 700 ఎకరాల్లో నాట్లు పూర్తి చేశారు. ఈ పథకం విజయవంతంగా నిర్వహించడానికి ప్రతీ ఏడాది ఎకరానికి రైతులు రూ.1,600 చెల్లిస్తున్నారు. ఆ సొమ్ముతో లస్కర్ జీతాలతో పాటు పథకం నిర్వహణ, మోటార్ల మరమ్మతులు చేయిస్తున్నాం. ప్రతి ఆరు నెలలకు ఒకసారి రైతులతో సమావేశం ఏర్పాటు చేసి రైతుల సలహాలు, సూచనలు తీసుకుంటున్నాం.

– తోటకూర శ్రీనివాస ప్రకాశరావు, ఎత్తిపోతల పథకం అధ్యక్షుడు, సామర్లకోట

ఉచిత విద్యుత్తుతో మేలు



ఎత్తిపోతల పథకాల కింద ఉన్న రైతులు ఒక సంఘంగా ఏర్పడి ఆ పథకాలను నిర్వహిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని 20 ఎత్తిపోతల పథకాల సాగు రైతులు ఒక సంఘంగా ఏర్పడ్డారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఈ పథకాలకు మరింత ప్రోత్సాహం ఇస్తోంది.

– పుట్టా సోమన్న చౌదరి, ఉమ్మడి జిల్లా ఎత్తిపోతల సమాఖ్య అధ్యక్షుడు, మర్రిపూడి

యోగా పోటీల్లో ప్రతిభ



యోగా పోటీల్లో సిల్వర్ మెడల్ అందుకుంటున్న యశ్వంత్

సామర్లకోట: స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న కిలాడి యశ్వంత్ జిల్లా స్థాయి యోగా పోటీల్లో సిల్వర్ మెడల్ సాధించినట్లు ఫిజికల్ డైరెక్టర్ తాళ్లూరి వైకుంఠం తెలిపారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఆదివారం కాకినాడ జేఎన్‌టీయూలో నేషనల్ యోగా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో యోగా పోటీలు నిర్వహించారన్నారు. ఇందులో సిల్వర్ మెడల్ సాధించి వచ్చే నెలలో ఒంగోలులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు యశ్వంత్ అర్హత సాధించాడన్నారు. విజేతను మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, కమిషనర్ జె.రామారావు, హెచ్ఎం తోటకూర సాయిరామకృష్ణ, పేరెంట్స్ కమిటీ చైర్మన్ చందలాడ శ్రీనివాసరావు అభినందించారు.

'జగనన్న సురక్ష'తో అర్హులకు మేలు

సామర్లకోట: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమంతో అర్హులకు మేలు జరుగుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ అన్నారు. స్థానిక 13వ సచివాలయం పరిధి అయోధ్యరామపురంలో ఏర్పాటు చేసిన సభకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అరుణ మాట్లాడుతూ ప్రజల అవసరాలు తెలుసుకుని పరిష్కరించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారన్నారు. వర్షంలో సైతం ప్రజలు జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అనంతరం సర్టిఫికెట్లను అర్హులకు అందజేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్లు ఉబా జాన్‌మోజెస్, గోకిన సునేత్రదేవి, మున్సిపల్ కమిషనర్ జె.రామారావు, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు, జగనన్న సురక్ష పట్టణ కన్వీనర్ ఇరుసుమళ్ల సాయి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

- మాధవపట్నంలో జరిగిన జగనన్న సురక్ష సభలో 209 మందికి సర్టిఫికెట్లు అందజేసినట్లు తహసీల్దార్ ఎస్ఎల్‌వీ కుమారి తెలిపారు. సర్పంచ్ మేడిశెట్టి సుగుణమ్మ, ఎంపీటీ సభ్యులు గుత్తుల కృష్ణార్జునరావు, మేడిశెట్టి దుర్గాదేవి తదితరులు పాల్గొన్నారు.



సామర్లకోటలో సర్టిఫికెట్లు పొందిన వారితో చైర్‌పర్సన్ తదితరులు



పొన్నాడలో లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీలు

ప్రభుత్వ పనితీరుకు ప్రజలే సాక్ష్యం

కొత్తపల్లి: ప్రభుత్వ పనితీరుకు సంక్షేమ పథకాలు అందుకుంటున్న ప్రజలే నిలువెత్తు సాక్ష్యమని ఎంపీపీ కారే సుధ, జెడ్పీటీసీ గుబ్బల తులసీకుమార్ అన్నారు. మండలంలోని పొన్నాడ గ్రామ సచివాలయం–2 వద్ద సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ, జెడ్పీటీసీ ముఖ్య అతిథులుగా పాల్గొని లబ్ధిదారులకు పలు రకాల ధృవీకరణ పత్రాలు అందజేశారు. ఎంపీపీ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగమోహన్‌రెడ్డి ఇప్పటికే 98 శాతం ఎన్నికల హామీలు అమలు చేశారన్నారు.గ్రామాల్లో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. జెడ్పీటీసీ తులసీకుమార్ మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజల చెంతకే ప్రభుత్వ సేవలు అందుతున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ బండి రాణి, ఎస్సీ, ఎస్టీ డివిజన్ మోనటరింగ్ కమిటీ సభ్యుడు బండి దావీదు, మండల ప్రత్యేకాధికారి పుష్పమణి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, ఎంపీడీఓ అబ్రహం లింకన్, తహసీల్దార్ ప్రసాద్, ఈఓపీఆర్డీ భాస్కరరావు, హౌసింగ్ ఏఈ శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ కారే ఉదయ్‌కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సేవ చేస్తూ.. శభాష్ అనిపించుకుంటూ..

వలంటీర్లకు వందనం

సామర్లకోట: సేవా సారథులు వలంటీర్లు. ప్రభుత్వానికి, ప్రజలకు అనుసంధానకర్తలుగా ఉంటూ పథకాల అమలులో వారు కీలక భూమిక పోషిస్తున్నారు. ప్రతి ఇంటికీ నవరత్న పథకాలను అందించడంలో అందిస్తున్న సేవలు అద్భుతం. సామర్లకోట నాలుగో సచివాలయానికి చెందిన పొడుగు శిరీష తనకు కేటాయించిన ప్రతి ఇంటికీ వెళ్లి సేవలు అందిస్తోంది. అవసరమైన వారికి పథకాలు దరిచేర్చడానికి శ్రమిస్తోంది. కుమ్మరవీధికి చెందిన దంగేటి శ్రీను ఆటో నడుపుతూ జీవనం సాగిస్తుండగా వాహనమిత్ర పథకం గురించి వివరించి అవసరమైన పత్రాలతో దరఖాస్తు చేయించింది. ఆ పథకం లబ్ధి పొందేలా చేసింది. ఇలా తన పరిధిలోని అందరికీ సేవలు అందిస్తూ మన్ననలు పొందుతుంది.



ఆటో డ్రైవర్ శ్రీనుకు వాహనమిత్ర పథకం గురించి వివరిస్తున్న వలంటీర్ శిరీష (ఫైల్)

మూడేళ్లుగా సాయం



అనేక మంది ఆటో డ్రైవర్లు తమ ఆటోలకు బీమా చేయించుకునే పరిస్థితిలో లేరు. దీనిని గమనించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వాహన మిత్ర పథకంపై వలంటీర్ శిరీష వివరించి ఆ పథకం అందేలా చూసింది. కావాల్సిన పత్రాలతో దరఖాస్తు చేయించింది. దీంతో ప్రతి ఏడాది నా బ్యాంకు ఖాతాలో రూ.10 వేలు జమ అవుతోంది.

– దంగేటి శ్రీను, ఆటో డ్రైవర్, సామర్లకోట

27 నుంచి ఫుట్‌బాల్ క్రీడాకారుల ఎంపిక

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): కాకినాడ ఫుట్‌బాల్ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 27 నుంచి 29 వరకూ సబ్ జూనియర్స్ విభాగంలో బాలుర, బాలికల క్రీడాకారుల ఎంపికలు జరుగుతాయని సంఘ కార్యదర్శి కె.రాజేష్ సోమవారం తెలిపారు. స్థానిక జిల్లా క్రీడా మైదానంలోని ఫుట్‌బాల్ ఫీల్డ్‌లో ఎంపికల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. 2011 జనవరి 1 నుంచి 2012 డిసెంబర్ 31 మధ్య పుట్టిన వారు అర్హులన్నారు. మరిన్ని వివరాలకు 83286 43876 ఫోన్ నంబరులో సంప్రదించాలని కోరారు.

పీఆర్ కళాశాలలో జాబ్‌మేళా

బాలాజీచెరువు: స్థానిక పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం దివీస్ ల్యాబ్ కంపెనీ జాబ్ మేళా నిర్వహించింది. డిగ్రీ ఆఖరి సంవత్సర సైన్స్ విద్యార్థులు 361 మంది హాజరుకాగా 260 మంది ఉద్యోగాలు సాధించారు. విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తిరుపాణ్యం, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ ఏలియా, వైస్ ప్రిన్సిపాల్ చెన్నారావు, ప్లేస్‌మెంట్ సెల్ కన్వీనర్ సోమరాజు అభినందించారు.

వానజోరు.. అన్నదాత హుషారు

- పొంగి ప్రవహిస్తున్న వాగులు, వంకలు
- ఊపందుకున్న ఖరీఫ్ సాగు పనులు

పిఠాపురం: అల్పపీడన ప్రభావంతో మెట్టలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఏలేరు జలాశయం పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు ఏలేరు కాలువల్లో నీటి ప్రవాహం రోజురోజుకూ పెరుగుతోంది. గొల్లప్రోలు మండలంలో సుద్దగెడ్డ వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. సుద్దగెడ్డ వాగు నీటి ప్రవాహం ప్రమాదకరంగా ఉండడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలకు గొల్లప్రోలు, పిఠాపురం, కొత్తపల్లి మండలాల్లో పంట కాలువలు పొంగుతున్నాయి.

జోరుగా ఖరీఫ్ సాగు పనులు

పిఠాపురం నియోజకవర్గంలో ఖరీఫ్ సాగు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. రైతులు పొలాలను దమ్ములు చేసి వరినాట్లు వేస్తున్నారు. పలు గ్రామాల్లో నాట్లు వేసిన వరి పొలాల్లోకి నీరు పోటెత్తింది.

వానొచ్చె.. ముంచేసె

సామర్లకోట: అల్పపీడనం ప్రభావంతో సోమవారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. దీంతో పట్టణ, రూరల్‌లోని పల్లపు ప్రాంతాలు, రోడ్లు జలమయం అయ్యాయి. సామర్లకోట బస్సు



గొల్లప్రోలులో కాలువ పొంగడంతో విద్యార్థులను జాగ్రత్తగా తీసుకెళుతున్న స్థానికులు

కాంప్లెక్స్, రైల్వే స్టేషన్ జయలక్ష్మీ థియేటర్ రోడ్డు, సత్యనారాయణపురం రోడ్డు, గణేష్ కాలనీ, భాస్కర్‌నగర్, సాయినగర్ వద్ద భారీగా నీరు చేరింది. రోడ్లపై నీరు డ్రైన్లలోకి వెళ్లే అవకాశం లేక స్టేషన్ సెంటర్‌లో చెరువును తలపించింది. వీకే రాయపురంలో కొత్తూరు, గొంచాల, అచ్చంపేట, జి.కొత్తూరు గ్రామాల్లో పలుచోట్ల వర్షపు నీరు చేరింది. వర్షాలతో వీకే రాయపురంలో రైతులు ఇబ్బంది పడుతున్నారు. పొలాల్లో చేరిన నీరు బయటకు పోవడానికి తూటేరు డ్రైన్‌లో గుర్రపు డెక్క తొలగించడానికి కలెక్టర్ నిధులు మంజూరు చేయగా, ఆ పనులు ప్రారంభించినప్పటి నుంచి వర్షం కురుస్తూ ఉండటంతో అంతరాయం ఏర్పడింది. దీంతో దమ్ములు ఆలస్యమయ్యే అవకాశం ఉంది. ఇప్పటికే దుంప సాగు రైతులు నాట్లు వేసుకోవడంతో వర్షంతో ఊరట చెందుతున్నారు.



కొత్తపల్లి మండలంలో నాట్లు పూర్తయిన వరి చేలు



సామర్లకోట స్టేషన్ సెంటర్‌లో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

పంచారామ క్షేత్రంలో భక్తుల రద్దీ

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరీ సమేత కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయానికి సోమవారం భక్తులు పోటెత్తారు. స్వామి వారికి ప్రీతికరమైన రోజు కావడంతో తెల్లవారుజాము నుంచే రద్దీ నెలకొంది. పిఠాపురం మహారాజా గోత్రనామాలతో అర్చకులు తొలిపూజ చేశారు. తరువాత అభిషేకాలు జరిపారు. భక్తులకు దేవస్థానం తరపున అన్నసమారాధన నిర్వహించారు. ఈఓ డి.నాగమల్లేశ్వరరావు, ట్రస్టు బోర్డు సభ్యులు, దేవదాయ శాఖ సిబ్బంది సేవలందించారు. పూజల అనంతరం మధ్యాహ్నం స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు.



సామర్లకోటలో భీమేశ్వరస్వామివారు

ఎనిమిది మందికి జరిమానా

సామర్లకోట: మద్యం తాగి వాహనాలు నడిపిన కేసులో కోర్టు ఎనిమిది మందికి రూ.10 వేల చొప్పున జరిమానా విధించినట్లు సీఐ కె.దుర్గాప్రసాద్ సోమవారం తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఆదివారం రాత్రి తనిఖీలు చేశామన్నారు. ఇందులో సామర్లకోటకు చెందిన ముగ్గురు, పెద్దాపురానికి చెందిన ఇద్దరు, రామచంద్రపురం, జొన్నాడ, ఆర్బీపట్నంకు చెందిన ఒక్కొక్కరిని డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో అదుపులోకి తీసుకున్నామన్నారు. సోమవారం వారిని కాకినాడ కోర్టులో హాజరు పరచగా పైవిధంగా జరిమానా వేశారన్నారు. ఈ తనిఖీల్లో ఎస్సైలు టి సునీత, గోపాలకృష్ణ పాల్గొన్నారని చెప్పారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు



గంగాభవాని (ఫైల్)

సామర్లకోట: పట్టణంలో ఓ బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు సీఐ కె.దుర్గాప్రసాద్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. స్థానిక గణేష్ కాలనీ బ్రౌన్‌పేట సెంటర్‌లో గంట భీమరాజు తమ కుటుంబంతో నివాసం ఉంటున్నారు. సోమవారం సాయంత్రం 6.30 గంటలకు అతని కుమార్తె గంగాభవాని(12) సమీపంలో కిరణా దుకాణానికి వెళ్లింది. అప్పటి నుంచి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెంది చుట్టుపక్కల వెతికినా ఆచూకీ దొరకలేదు. ఆ బాలిక కనిపించకుండా పోయిన సందర్భంలో నీలం కలర్ డ్రస్, ఆరెంజ్ కలర్ చున్నీ ధరించి ఉంది. తమ కుమార్తెకు మాటలు సరిగ్గా రావని, ఫిట్స్ కూడా వస్తుంటాయని తండ్రి భీమరాజు తెలిపారు. ఈ మేరకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వివరాలు తెలిసిన వారు 94407 96568, 97016 26505 ఫోన్ నంబరులలో సంప్రదించాలని సీఐ తెలిపారు.

ఓటర్ల సర్వే పారదర్శకంగా చేయాలి

నియోజకవర్గ ప్రత్యేకాధికారి సుబ్బారావు

పిఠాపురం: ఓటర్ల సర్వేను పారదర్శకంగా చేయాలని కుడా చైర్మన్, నియోజకవర్గ ప్రత్యేకాధికారి సుబ్బారావు సిబ్బందికి సూచించారు. గొల్లప్రోలు నగర పంచాయతీలో నిర్వహిస్తున్న ఇంటింటా ఓటర్ల సర్వేను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికీ వెళ్లి ఆ ఇంట్లో ఓటర్లు ఎంత మంది ఉన్నా వారందరి వివరాలు పూర్తిగా ఆధారాలతో సేకరించాలన్నారు. మార్పులు చేర్పులు ఉంటే కుటుంబ సభ్యుల సమక్షంలో సరి చేయాలన్నారు. ఎక్కడా తేడాలు రాకుండా పారదర్శకంగా, పక్కా పూర్తి వివరాలు సేకరించాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట గొల్లప్రోలు నగర పంచాయతీ కమిషనర్ సత్యనారాయణ తదితరులు ఉన్నారు.



ఓటర్ల సర్వేను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి సుబ్బారావు

సాగర తీరం.. సుమనోహరం

పిఠాపురం: ఆకాశం నుంచి అప్పుడే కిందకు దిగుతున్న మేఘాలు కనీకనిపించని సూరీడు మధ్య పుడమిని పట్టుకుందామన్నట్టుగా నీలి సంద్రం ఎగసిపడుతుంటే ఆ రెండిటికీ మధ్య పాల పొంగు లేచినట్టు తెల్లని కెరటాలు కనువిందు చేశాయి. అల్పపీడనం ప్రభావంతో సోమవారం వాతావరణం కూల్‌కూల్‌గా ఉంది. ఉప్పాడ సాగర తీరంలో చిన్న చిన్న చినుకులు పడుతుంటే కడలి ఉరకలేస్తూ కెరటంగా వచ్చి ఒడ్డుకు చేరే లోపు నీలి రంగు కాస్తా తెల్లని పాల్లవెల్లువలా మారుతూ చూపరులకు కనువిందు చేసింది. చల్లని వాతావరణంలో సాగర తీరం మనోహరంగా కనిపించింది.



ఉప్పాడ తీరంలో కనువిందు చేస్తున్న కెరటాలు

గడ్డి మందు తాగి వ్యక్తి ఆత్మహత్యాయత్నం

పిఠాపురం: గొల్లప్రోలు మండలం చెందుర్తిలో గడ్డి మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు గొల్లప్రోలు పోలీసులు సోమవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. చెందుర్తికి చెందిన మాతా ఏసుబాబు (35) పొలాల్లో కాపలా ఉండి వ్యవసాయ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 23వ తేదీ సాయంత్రం గ్రామంలో పొలంలోకి వెళ్లి అర్ధరాత్రి దాటినా రాక పోవడంతో అతని భార్య తమ బంధువులకు చెప్పగా పొలంలోకి వెళ్లి వెతికారు. అక్కడ ఏసుబాబు కింద పడి ఉండి కనిపించాడు. ఏం జరిగిందని అడగ్గా తనకు మానసిక స్థితి బాగోలేదని, గడ్డిమందు తాగానని చెప్పడంతో అతడిని ప్రత్తిపాడు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. గొల్లప్రోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.